# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం  తెలుగు పత్రిక

సంపుటి :02  సంచిక :49  శుక్రవారం  14-11-2025  పేజీలు:4  వెల:2/-

Website:- https://www.crimecounter.in/



క్రైమ్ కౌంటర్ News
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

రిపోర్టర్లు కావలెను

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ






ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్...

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి అచ్చంపేట: - వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లాలోని ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ సందర్శించిన జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందితో కలిసి జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. స్టేషన్ కి వచ్చే ఫిర్యాదుల పట్ల ముఖ్యంగా డయల్-100 కాల్స్‌కు వెంటనే స్పందించాలని, ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెంచే విధంగా వ్యవహరించాలని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఎస్పీ వైభవ్ గైక్వాడ్ సూచించారు. స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీటి షీటర్ల వివరాలను తెలుసుకుని, వారి కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.గ్రామ స్థాయిలో పనిచేస్తున్న విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ తమ తమ గ్రామాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. నేర నిరోధక చర్యల్లో భాగంగా ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చురుకుగా ముందుకు రావాలని ఆదేశించారు. తనిఖీ సమయంలో స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా ఎస్పీ, ఉప్పునుంతల ఎస్సై వెంకట్ మరియు సిబ్బందిని ప్రశంసించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ వ్యవస్థ మరింత బలోపేతం కావాలన్నారు.

## పిఆర్‌ఓ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన..



మహబూబ్‌నగర్ జిల్లా పిఆర్‌ఓ ఎస్.శ్రీనివాసులకు రాష్ట్ర డిజిపి చేతుల మీదుగా ప్రశంసా పత్రం...

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా: - హైదరాబాద్‌లోని పెట్లబుర్జ్ సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ సిపిటిసి నందు మూడు రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర పోలీస్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్లకు వీఆర్వోస్ నిర్వహించిన శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి ఐపిఎస్ ప్రధాన అతిథిగా ముగింపు సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా ప్రజా సంబంధాల అధికారి ఎస్. శ్రీనివాసులు శిక్షణలో సఫలంగా పాల్గొని, రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఐపిఎస్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. జానకి ఐపిఎస్ శ్రీనివాసులు ని అభినందిస్తూ, "ప్రజా సంబంధాల విభాగం పోలీస్ వ్యవస్థకు ముఖచిత్రం వంటిది. శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను జిల్లాలోని పోలీస్ ప్రజా సంబంధాల పనిలో ఉపయోగించి మరింత చురుకుగా పనిచేయాలని" సూచించారు.ఈ కార్యక్రమంలో ఐ జి పి పి ఎల్ రమేష్ రెడ్డి ఐపీఎస్.డిసిపి సిఏఆర్ రక్షిత మూర్తి ఐపీఎస్, శిక్షణా సమన్వయకర్త మధుసూదన్ మరియు తెలంగాణ సురక్ష బృందం సభ్యులు పాల్గొన్నారు.



## తెలంగాణ – ఆంధ్రప్రదేశ్‌లను కలుపుతూ

# కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ వంతెన

- కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ వంతెన
- సోమశిల, సిద్ధేశ్వరం మధ్య నిర్మాణం
- అంచనా వ్యయం రూ.1083 కోట్లు

తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌లను కలుపుతూ కృష్ణానదిపై సోమశిల వద్ద ఐకానిక్ కేబుల్ వంతెన నిర్మించనున్నారు. రూ. 1083 కోట్లతో 1.77 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ వంతెన, ప్రమాదకరమైన పడవ ప్రయాణాలకు ముగింపు పలికి, ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలను సులభతరం చేయనుంది. వచ్చే ఏడాది జనవరిలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ వంతెన అందుబాటులోకి రానుంది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి వేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్న సోమశిల వద్ద నిర్మించనున్న ఈ భారీ ప్రాజెక్టు కోసం భూ సేకరణ, టెండర్ల ప్రక్రియ దాదాపు పూర్తి కావడంతో త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. జాతీయ రహదారుల సంస్థ అధికారులు ఈ ప్రాజెక్టును మూడో ప్యాకేజీలో చేపట్టనున్నట్లు తెలుస్తోంది. మొత్తం 1.77 కిలోమీటర్ల పొడవున ఈ కేబుల్ వంతెనను నిర్మించనున్నారు. నిర్మాణ వ్యయం సుమారు రూ. 1083 కోట్లుగా అంచనా వేశారు. శ్రీశైలం జలవిద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో సుమారు 117 గ్రామాలు, లక్షలాది ఎకరాల భూమి ముంపునకు గురైంది. అప్పటి నుంచి ఈ రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా.. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ (సోమశిల) తీరానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందికొట్కూర్ పరిధిలోని సిద్ధేశ్వరం గుట్టల మధ్య ప్రయాణించడానికి ప్రజలు పడవలు, పుట్టీలపై ప్రమాదకరంగా నదిని దాటాల్సి వస్తోంది. ఈ ప్రమాదకర ప్రయాణంలో చాలామంది ప్రాణాలు కోల్పోవడం తీర గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. ఈ కేబుల్ వంతెన నిర్మాణంతో ఈ శాశ్వత రాకపోకల సమస్య పూర్తిగా తీరిపోతుంది. టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నందున.. అధికారులు వచ్చే ఏడాది జనవరిలో నిర్మాణ పనులను అధికారికంగా చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వంతెన నిర్మాణంలో భాగంగా సోమశిల, సిద్ధేశ్వరం గుట్టల వైపు అడుగుభాగంలో 70 మీటర్ల ఎత్తులో, నదీ ప్రవాహం పైన సుమారు 100 మీటర్ల ఎత్తులో పిల్లర్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇది కేవలం రవాణాకే కాకుండా, ఒక పర్యాటక ఆకర్షణీయ కేంద్రంగా కూడా అభివృద్ధి చెందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వంతెనతో పాటుగా, రెండు వైపులా అప్రోచ్ రహదారుల నిర్మాణం కూడా కీలకమైనది. ఈ అప్రోచ్ రహదారి మొత్తం పొడవు 13 కిలోమీటర్లుగా నిర్ణయించగా.. దీని కోసం రూ. 460 కోట్లు నిధులు కేటాయించారు. కొల్లాపూర్ మండలం వరిదేల రెవెన్యూ శివారు నుంచి సోమశిల గుట్ట వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్డు నిర్మించడానికి సోమశిల, చెన్నంపల్లి, పెంట్లవెల్లి, మల్లేశ్వరం శివార్ల పరిధిలో మొత్తం 25 హెక్టార్ల అటవీభూమి, 28 హెక్టార్ల రెవెన్యూ మరియు పట్టా భూములను సేకరించారు. సిద్ధేశ్వరం గుట్ట నుంచి కపిలేశ్వరం, నందికొట్కూరు అటవీ ప్రాంతంలో సుమారు 5 కిలోమీటర్ల మేర అప్రోచ్ రహదారి కోసం 25 హెక్టార్ల మేర భూసేకరణ పూర్తయింది. ఈ వంతెన పూర్తి కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య దూరం తగ్గడంతో పాటు ఆర్థిక భారం తగ్గి, శాశ్వతంగా రాకపోకల సమస్య తీరుతుందని తీర గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్యం, పర్యాటక రంగాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు చెబుతున్నారు.

## కార్తీక మాస వనభోజనాలను విజయవంతం చేయాలి.



నలజాల శ్రీనివాసరావు.

క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్ 13 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో ):- కాకతీయ కమ్మ సంక్షేమ సంఘ కార్తీక మాస వనభోజనాలను విజయవంతం చేయాలి అని ఆ సంఘ నాయకులు నలజాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలో కార్తీక మాసం వనభోజనాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ నిర్వహించి ఆయన మాట్లాడారు. కోదాడ మండలం దోరకుంట గ్రామ పరిధిలోని ఎర్నేని వెంకటరత్నం బాబు మామిడి తోటలో ఈనెల 16 ఆదివారం కార్తీక మాస వనభోజనాల సందర్భంగా ఉసిరి చెట్టు పూజలు వనభోజనాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ముత్తవరపు రామారావు, డాక్టర్ ఏటుకూరి రామారావు, సాతులూరి హనుమంతరావు, కర్రి సబ్బారావు, చిట్టిబాబు,పోటు కోటేశ్వరరావు, పెద్ది అంజయ్య , తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కోదాడ డిపో ఉద్యోగులు.



క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నంబర్ 13 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో ):- ఇటీవల క్యాన్సర్ తో బాధపడుతూ అకాల మరణం చెందిన కండక్టర్ ఎ. శోభారాణి పిల్లల చదువులకు తమ వంతుగా తోటి ఉద్యోగిని కొరకు కోదాడ డిపో ఉద్యోగులు అందరూ మానవత్వ దృక్పథంతో ఆర్థిక చేయూత అందించారు. అందరూ కలిసి వారి వంతు కర్తవ్యం గా సహృదయంతో రూ. 1,61, 200/- లు. ఆమె కూతురి పేరు న పోస్ట్ ఆఫీస్ లో ఫిక్సడ్ డిపాజిట్ చేసి ఆ పాస్ బుక్ ను కోదాడ డిపో మేనేజర్ బి. శ్రీనివాసరావు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం చేసినందుకు డిపో ఉద్యోగస్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి. నాగశ్రీ , సూపరిండెంట్ సిహెచ్. నాగిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్ , సిబ్బంది, అంజలి, శ్రీదేవి, భవాని, జ్యోతి పాల్గొన్నారు.

# చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలి, డ్రగ్స్ పై అవగాహన తప్పనిసరి.







**డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం బి ఎస్ ఎఫ్ ఐ నాయకులు కర్ల ప్రేమానంద్.**

**లోటస్ స్కూల్ నందు బి ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘం నాయకులు అవగాహన సదస్సు.**

క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్ 13 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో ):- సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో లోటస్ స్కూల్ నందు యాంటి డ్రగ్స్ ఎవర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్ల ప్రేమానంద్ హాజరై మాట్లాడుతూ, మాదకద్రవ్యాల ప్రభావం నుంచి సమాజాన్ని దూరంగా ఉంచడం కోసం ప్రతి యువకుడి బాధ్యత తీసుకోవాలని విద్యార్థులతో పాటు తమ స్నేహితులను కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే సమాజంలో మద్యపానం,ధూమపానం, గంజాయికి "నో" చెప్పి ఆరోగ్యవంతమైన, చైతన్యమయమైన భారత నిర్మాణానికి తోడ్పడాలని వారు ఆకాంక్షించారు. అలాగే మాదకద్రవ్యాల వాడకం నేటి యువతలో వేగంగా పెరుగుతోందని, అది వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మొత్తానికి ముప్పుగా మారుతోందని తెలిపారు. డ్రగ్స్, సిగరెట్, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉంటేనే మన ఆరోగ్యం, భవిష్యత్తు కాపాడబడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో లోటస్ స్కూల్ చైర్మెన్ నంద కిషోర్, కర్స్పండెంట్ బి రామారావు, ,డైరెక్టర్ శేఖర్ , టి.అంజయ్య ప్రిన్సిపాల్ డి సైదులు మరియు బి ఎస్ ఎఫ్ ఐ కోదాడ నియోజకవర్గ ఉపాధ్యకులు హేమంత్ క్రిష్ణ, అంచ శివ చౌదరి,తదితరులు పాల్గొన్నారు.

# ఉపకార వేతనంకు ఎంపికైన (29) మంది కోదాడ విద్యార్థులు.



క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్ 13 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో) భారతీయ తపాల శాఖ వారు దేశ వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు దీన్ దయాళ్ స్పర్శ్ యోజన పేరు మీద " ఫిలాటలీ " విభాగంలో క్విజ్ పోటీలు మరియు ప్రాజెక్ట్ పని పోటీ నిర్వహించి ఉపకారవేతనాలు ఇవ్వడం జరుగుతుంది. తెలంగాణ విభాగంలో తపాలా శాఖ వారు అక్టోబర్ 12వ తేదిన క్విజ్ పోటీలు నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా 10,000 మందికి పైగా ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో నుంచి రెండవ దశ ప్రాజెక్ట్ పని పోటికి 100 మందిని ఎంపిక చేయడం జరిగింది. తేజ విద్యాలయ కొమరబండ విద్యార్థులు (29) మంది అర్హత సాధించారు. భారతీయ తపాల శాఖ రెండవ విడతలో ఆరు అంశాలు ఇచ్చి ఎంపికైన విద్యార్థుల నుంచి ప్రాజెక్ట్ పని పోటీ నిర్వహిస్తోంది దీనిలో ఉత్తమమైన ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనం అందిస్తోంది. వీరిలో ఆరుగురు 6వ తరగతి విద్యార్థులు, శ్రీపాద వల్లభ, దుస్సా దివిజ శ్రీ , శెట్టి నవదీప్, చల్లా హరిహరణ్, షేక్ జునైద్ , యరదేశి మహిధర్ యాదవ్ , తొమ్మిది మంది 7వ తరగతి విద్యార్థులు బాణాల స్మరణ్ రెడ్డి , కోసూరి కౌశిక్ గౌడ్, షేక్ కైఫీ సుబహన్, శ్రీనివాసన్ ఠాగూర్, మిథున్ చక్రవర్తి, పిడమర్తి ప్రసస్థ్య , సోమ వెంకట శ్లోక , కొండోజు అభిజ్ఞ , ఓరుగంటి అనంత లక్ష్మి, పది మంది 8వ తరగతి విద్యార్థులు మీగడ అఖిలేష్ , కర్నాటి శ్రీకర్ , బుసరాజు జేసన్ ప్రసస్థ్ , బుర్రి నివాస్ రెడ్డి , పోలె ఎబోనీ జాయ్సా , పాలమూరు జ్ఞాన ప్రజ్వల్ , దిలీప్ కార్తీక్ రెడ్డి , భువనేష్, వాకా రిషిత శ్రీ , ఎసిరెడ్డి భాగ్యశ్రీ , నలుగురు 9వ తరగతి విద్యార్థులు షేక్ రియా, షేక్ సర్దార్ రాఖీబ్, యర్రంశెట్టి శ్రేష్ఠ, ధరావత్ నితీష్ రాజ్ లు ఎంపికయ్యారు. తేజ విద్యాలయ కోదాడ పాఠశాల నుండి ఒకేసారి (29) మంది విద్యార్థులు ఎంపిక కావడం చాలా గర్వకారణంగా ఉందని ప్రిన్సిపాల్ రమాదేవి చెప్పారు.

# కోదాడలో మద్రాస్ ఫిల్టర్ కాఫీ కేఫ్ ప్రారంభం.







క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్ 13 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో) కోదాడ పట్టణంలో జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో నూతనంగా మద్రాస్ ఫిల్టర్ కాఫీ కేఫ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు లు అన్నారు. గురువారం కేఫ్ నిర్వాహకులు మాజీ ఎంపీటీసీ ఎండి. జాకీర్ షేక్. ఆరిఫ్ షేక్. అసిఫ్ లతో కలిసి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన, రుచికరమైన కాఫీని వినియోగదారులకు అందించి వారి మన్ననలు పొంది వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం కేఫ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు, డాక్టర్ రామారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, అల్తాఫ్ హుస్సేన్, పైడిమరి సత్తిబాబు, ఓరుగంటి ప్రభాకర్, షేక్ షఫీ, కొండలరావు, బాబా తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులపై దాదులను ఖండించండి.



**ఉయ్యాల నర్సయ్య, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు.**

క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్13 ( గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో) :- నిర్మల్ కోర్టులో ఒక కేసులో నిందితులను సరెండర్ చేస్తున్న న్యాయవాది పి.అనిల్ కుమార్ కారుపైన పోలీసులు జరిపిన దాడిని ఖండిస్తూ,వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం నాడు కోదాడ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య మాట్లాడుతూ, న్యాయవాదులు తమ విధి నిర్వహణలో భాగంగా సరెండర్ చేస్తుంటే, పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని న్యాయవాది అనిల్ కుమార్ ను దుర్భాషాలాడుతూ, కులం ప్రస్తావన తెచ్చి దురుసుగా ప్రవర్తించడం మరియు కోర్టు ప్రాగణంలోనే అతని కారు ను ధ్వంసం చేయడం అత్యంత దారుణమైన చర్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులంటే సులకన చేసేలా పోలీసుల వ్యవహారం ఉందన్నారు. పోలీసులు చేసే అనేక చర్యలను ఖండిస్తూ, వారి చర్యలకు వ్యతిరేకంగా, ప్రశ్నిస్తూ పని చేసే న్యాయవాదుల ఆత్మస్థైర్యం దెబ్బతీయడంలో భాగంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి దాడులు న్యాయవాదులపైన జరిగినట్లు కాదని మొత్తం న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్యం పై జరిగే దాడిగా భావించాలని, ఇలాంటి చర్యలను ప్రజలందరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. నిర్మల్ కోర్టులో అడ్వకేట్ కారు పై దాడి చేసి,అతని పట్ల దురుసుగా ప్రవర్తించి,దౌర్జన్యం కు పాల్పడిన పోలీసులపై కేసు నమోదు చేసి,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,పి. అనిల్ కుమార్ కుటుంబంకు రక్షణ కల్పించాలని మరియు కేంద్ర ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను తేవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు నాగుబండి కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, నయిమ్, హుస్సేన్, నవీన్, చలం, కె.మురళి సీనియర్ న్యాయవాదులు తమ్మినేని హనుమంతరావు, రంజాన్ పాషా, ఈదుల కృష్ణయ్య, యశ్వంత్ రామారావు, ఉదారు శ్రీనివాస్, నాళం రాజన్న, రియాజ్, దొడ్డ శ్రీధర్, తాటి మురళి, గోవర్ధన్, మీరా, బాలయ్య, శరత్, పాషా, శ్రావణ్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.
ఉయ్యాల నర్సయ్య, అడ్వకేట్,కోదాడ.

# హైదరాబాద్ రోడ్లకు కొత్త కొత్త పేర్లు వచ్చేస్తున్నాయి..



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో జరిగిన అమెరికా-భారతదేశ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు లో మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు అత్యుత్తమ గమ్యస్థానమని వివరించారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం, పటిష్టమైన భద్రత, భౌగోళికంగా దేశానికి కేంద్ర స్థానంలో ఉండటం వంటి అంశాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. తెలంగాణ దేశంలోనే అతిపెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటు కలిగిన రాష్ట్రమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ పెట్టుబడులకు అత్యున్నత కేంద్రంగా నిలపడమే లక్ష్యంగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విప్లవాత్మక నిర్ణయాన్ని ప్రకటించారు. ఇప్పటివరకు రోడ్లకు రాజకీయ నాయకుల పేర్లు పెట్టే సంప్రదాయాన్ని మార్చి.. గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి అంతర్జాతీయ టెక్ దిగ్గజాల పేర్లు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని ఆయన తెలిపారు. ఢిల్లీలో జరిగిన అమెరికా-భారతదేశ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ కేంద్రంగానే కాకుండా.. గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని ఆయన ఆహ్వానించారు. దీనివల్ల తక్కువ ఖర్చు, సులభ వీసా విధానాలతో గ్లోబల్ సౌత్ దేశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, పటిష్టమైన భద్రతతో కూడిన భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని సీఎం వివరించారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటు తెలంగాణలో ఉన్నాయని పేర్కొన్నారు. జీసీసీలకు (గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్) హైదరాబాద్ ముఖ ద్వారంగా నిలిచిందని తెలిపారు. సదస్సులో ప్రదర్శించిన 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్' అంతర్జాతీయ వ్యాపార వర్గాలను, ముఖ్యంగా సిస్కో మాజీ సీఈవో జాన్ ఛాంబర్స్‌ను ఆకట్టుకుంది. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యాన్ని అధ్యక్షుడు ముఖేష్ ఆఘి ప్రశంసించారు. ఆయన డిసెంబరు 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకానున్నట్లు ప్రకటించడం ఈ విజన్‌కు లభిస్తున్న అంతర్జాతీయ మద్దతుకు నిదర్శనం. అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని సీఎం పునరుద్ఘాటించారు. 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మించడం ద్వారా హైదరాబాద్ దేశంలోనే నూతన నగరంగా మారుతుందని తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే.. లండన్ తరహా రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని వివరించారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లు, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ప్రాజెక్టుల పురోగతిని సీఎం వివరించారు.

# తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల..

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్ విడుదలైంది. దీనికి సంబంధించిన పూర్తి నోటిఫికేషన్ శుక్రవారం విడుదల కానుంది. టెట్ పరీక్ష కోసం అభ్యర్థులు నవంబర్ 15 నుంచి ఈ నెల 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. పరీక్షలను వచ్చే సంవత్సరం.. జనవరి 3, 2026 నుంచి 31వ తేదీ వరకు సుదీర్ఘ కాలంలో నిర్వహించనున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఇది నిజంగా తీపి కబురు. తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) 2026 నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యా శాఖ అధికారులు తాజాగా విడుదల చేశారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాలనే నిబంధనను పటిష్టంగా అమలు చేస్తూ.. ఈ నోటిఫికేషన్‌ను ప్రకటించడం విశేషం. అధికారులు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. టెట్ పూర్తి నోటిఫికేషన్ శుక్రవారం అంటే నవంబర్ 14వ తేదీన విడుదల కానుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నవంబర్ 15వ తేదీ శనివారం నుంచి ప్రారంభమై నవంబర్ 29వ తేదీ వరకు కొనసాగుతుంది. టెట్ పరీక్షలు 2026వ సంవత్సరం, జనవరి 3వ తేదీ నుంచి ప్రారంభమై.. అదే నెల 31వ తేదీ వరకు సుదీర్ఘంగా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని పరీక్షా కేంద్రాల్లో జరుగుతాయి. ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో రెండు పేపర్లు ఉంటాయి. టెట్ పరీక్షను ఏటా రెండుసార్లు తప్పనిసరిగా నిర్వహించాలనే నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిబంధన ఉన్నప్పటికీ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో కేవలం నాలుగు సార్లు మాత్రమే టెట్ జరిగింది. ఈ నిర్లక్ష్యంపై విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ అధికారులను ఆదేశించి.. ఏటా రెండు సార్లు టెట్ నిర్వహించేలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఇప్పటికే రెండు సార్లు టెట్ నిర్వహించిన ప్రభుత్వం.. తాజాగా 2026వ సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేష-న్‌ను ప్రకటించింది. అభ్యర్థులు తమ అర్హతలను (బీఎడ్ / డీఎడ్) సరిచూసుకుని... నిర్దేశించిన తేదీల్లోపు దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి. ఈ పరీక్షలో సాధించిన అర్హత (క్వాలిఫైడ్ మార్కులు) ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ)లో 20 శాతం వెయిటేజీకి ఉపయోగపడుతుంది కాబట్టి.. దీన్ని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది. పరీక్షా విధానం, సిలబస్‌లో ఏమైనా మార్పులు ఉంటే, నోటిఫికేషన్ విడుదల సందర్భంగా తెలుసుకోవచ్చు. పూర్తి వివరాలకు అధికారిక వెబ్ సైట్

# వరంగల్ బస్‌స్టాండ్‌లో పడవ ప్రయాణం..



వరంగల్ మోడల్ బస్‌స్టాండ్ పనులు నిలిచిపోయి, తవ్విన గుంత నీటితో నిండిపోవడంతో అది చెరువుగా మారింది. ఈ పరిస్థితిపై బీజేపీ నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు. బస్‌స్టాండ్ ప్రాంగణంలో పడవలతో తిరుగుతూ.. పూలు చల్లుతూ నిరసన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయని.. కాంట్రాక్టర్ మట్టితవ్వకాలు పూర్తి చేసి వదిలేశాడని వారు ఆరోపించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్, ఎర్రబల్లి ప్రదీప్‌రావు నేతృత్వంలో ఈ నిరసన జరిగింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే పనులు ప్రారంభించాలని బీజేపీ డిమాండ్ చేసింది. చెరువులా మారిన బస్‌స్టాండ్ ప్రాంగణంలో పడవల నిరసన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వరంగల్ మహానగరంలో కనీసం ప్రయాణికులకు ఒక స్థిరమైన బస్ స్టాండ్ లేకుండా పోవడంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. వేలాది వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ ఎదురుగా అసంపూర్తిగా వదిలేసిన మోడల్ బస్ స్టాండ్ ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తుండగా.. బీజేపీ నాయకులు అందులో పడవలు నడిపి తమ ఆగ్రహాన్ని ప్రదర్శించారు. బస్సులను నడపాల్సిన చోట పడవలు నడపాల్సిన దయనీయ పరిస్థితిని తీసుకొచ్చినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అధికార కాంగ్రెస్ గతంలో అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించారు. రూ. 74 కోట్ల వ్యయంతో మొదలుపెట్టిన స్మార్ట్ సిటీ మోడల్ బస్ స్టాండ్ నిర్మాణం పనులు రెండేళ్లు గడిచినా ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం సిగ్గుచేటన్నారు. సెల్లార్ నిర్మాణం కోసం సుమారు 20 అడుగుల లోతు మట్టి తవ్వి అసంపూర్తిగా వదిలేయడం వల్లే ఆ ప్రాంతం వర్షపు నీటితో నిండి.. ప్రమాదకరంగా మారిందని తెలిపారు. బస్ స్టాండ్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడానికి ప్రధాన కారణం కాంట్రాక్టర్‌కు, అప్పటి నాయకులకు మధ్య కమిషన్ల విషయంలో ఏర్పడిన విభేదాలేనని బీజేపీ నాయకులు ఆరోపించారు. తాత్కాలిక బస్ స్టాండ్‌తోనే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. దీనికి ఆ రెండు పార్టీలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా తీర్చిదిద్దుతామంటూ ప్రగల్భాలు పలికిన ప్రభుత్వాలు.. కనీసం బస్ స్టాండ్‌ను కూడా నిర్మించకపోవడం ఏమిటని బీజేపీ ప్రశ్నించింది. స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ (ప్రస్తుత మంత్రి) ఈ సమస్యను పట్టించుకోకపోవడం ఆమె అసమర్థతకు నిదర్శనమన్నారు. అలాగే.. గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాత బస్ స్టాండ్‌ను కూల్చి.. కొత్త నమూనాలు చూపించి మాయమాటలు చెప్పారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం హృదయ్, అమృత్, స్మార్ట్ సిటీ వంటి పథకాల ద్వారా వరంగల్‌కు భారీగా నిధులు కేటాయిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఓరుగల్లు చరిత్రను భ్రష్టు పట్టిస్తున్నాయని విమర్శించారు. గంటా రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వన్నాల శ్రీరాములు వంటి ముఖ్య నేతలు పాల్గొన్న ఈ నిరసనలో.. వెంటనే బస్ స్టాండ్ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఓరుగల్లు సమగ్రాభివృద్ధి కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి.. ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తామని బీజేపీ హెచ్చరించింది.

# జూబ్లీహిల్స్ ఫలితాలు..



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ 48.49 శాతంగా నమోదైంది. అత్యధికంగా రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్లు పోలింగ్‌లో కీలకంగా మారాయి. రేపు (శుక్రవారం, నవంబర్ 14) ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ కౌంటింగ్ జరుగుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి.. ఆ తర్వాత 407 కేంద్రాల ఓట్లను 10 రౌండ్లలో పూర్తి చేస్తారు. మొత్తం 58 మంది అభ్యర్థుల కోసం 42 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కేంద్రం వద్ద పటిష్ట భద్రత, 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ మొత్తంగా 48.49 శాతం నమోదు చేసుకుంది. ఈ తక్కువ పోలింగ్ శాతం ఏ పార్టీకి లాభిస్తుందనే ఉత్కంఠ కొనసాగుతుండగానే.. నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ నమోదైన ప్రాంతాలే గెలుపు గుర్రాన్ని నిర్ణయించబోతున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గెలుపు కీలకం ఈ ప్రాంతాలే.. పోలింగ్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. మొత్తం 407 కేంద్రాలలో 34 కేంద్రాల్లో 60 శాతానికిపైగా.. 192 కేంద్రాల్లో 50 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. ఈ కేంద్రాల్లోనే అధిక ఓటర్లు ఉండటం వల్ల, ఇక్కడ ఎక్కువ ఓట్లు సాధించిన పార్టీనే విజయాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గణాంకాల ప్రకారం.. అత్యధిక పోలింగ్ నమోదైన ప్రాంతాలు ఇలా ఉన్నాయి. రహ్మత్‌నగర్ డివిజన్ లో .. ఇక్కడి 73 కేంద్రాల్లో 50 శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదైంది. ఈ డివిజన్‌లోని 15 కేంద్రాల్లో 60 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం కీలకం. బోరబండ డివిజన్ లో.. 47 కేంద్రాలు 50 శాతం కంటే ఎక్కువ ఓటింగ్ నమోదు చేశాయి, 13 కేంద్రాల్లో 60 శాతం దాటింది. ఎర్రగడ్డలో 30 కేంద్రాల్లో 50 శాతం కంటే ఎక్కువ.. 3 కేంద్రాల్లో 60 శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదైంది. దీనికి విరుద్ధంగా.. వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్లలోని కాలనీ ప్రాంతాలు, ముఖ్యంగా ధనిక వర్గాలు నివసించే ప్రాంతాలు అత్యల్పంగా ఓటు వేశాయి. ఉదాహరణకు.. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఓటేసిన 217వ కేంద్రంలో అత్యల్పంగా 28.61 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఇక్కడ పోలీసులు, అద్దెకు ఉండే ఓటర్లు నివాసాలు మారడం వల్ల ఓటింగ్ తగ్గింది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓటేసిన 290వ కేంద్రంలో 32.82 శాతం, భాజపా అభ్యర్థి దీపక్‌రెడ్డి ఓటేసిన 301వ కేంద్రంలో 41.86 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా బోరబండ రాజ్‌నగర్లోని 334వ కేంద్రంలో 72.78 శాతం పోలింగ్ నమోదైంది. ఎగ్జిట్ పోల్స్‌తో సంబంధం లేకుండా, ఈ గణాంకాల ఆధారంగానే అభ్యర్థులు గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు. ఓట్ల లెక్కింపు రేపు (శుక్రవారం, నవంబర్ 14) ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలోని డీఆర్సీ సెంటర్‌లో కౌంటింగ్ జరుగుతుంది. మొదట ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లను లెక్కించడం ప్రారంభిస్తారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపునకు, బరిలో ఉన్న 58 మంది అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని 42 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం లెక్కింపు 10 రౌండ్లలో పూర్తి కానుంది. ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌తో పాటు మీడియా కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రదర్శిస్తారు. లెక్కింపు కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 250 మంది పోలీసులు, 15 ప్లాటూన్ల సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

# చెత్త, వ్యర్థ నివారణపై ఫైన్ విధించే జీహెచ్ఎంసీకి..



చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా జీహెచ్ఎంసీకి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) రూ.1 లక్ష జరిమానా విధించింది. నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను నియమాలను పట్టించుకోకుండా జవహర్‌నగర్‌లో డంప్ చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేయడంతో ఎన్జీటీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజలు, వ్యాపారులు చెత్త వేస్తే జరిమానాలు వేస్తున్న జీహెచ్ఎంసీకి ఇప్పుడు తానే జరిమానా పడింది. చెత్త, వ్యర్థాల నిర్వహణలో క్రమబద్ధత పాటించి, పర్యావరణానికి హాని కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో వ్యర్థాల యాజమాన్యంలో సరైన పద్ధతులను పాటించడంలో విఫలమైనందుకు గాను, జాతీయ హరిత ట్రిబ్యునల్ జీహెచ్ఎంసీ (బల్దియా)కు లక్ష రూపాయల జరిమానా విధించింది. చెత్త నిర్వహణలో ప్రజలకు జరిమానాలు విధిస్తున్న జీహెచ్ఎంసీకే జరిమానా పడటం గమనార్హం. ఈ వ్యవహారం వెనుక ప్రధాన కారణం జవహర్‌నగర్ డంపింగ్ యార్డు. నగరంలో ఉత్పత్తయ్యే లక్షలాది టన్నుల చెత్తను సక్రమంగా నిర్వహించకుండా, ఇష్టానుసారంగా జవహర్‌నగర్‌లో డంపింగ్ చేస్తున్నారంటూ ఆ ప్రాంత ప్రజలు ఎన్జీటీని ఆశ్రయించారు. దీంతో చెత్త డంపింగ్ వల్ల తమ ఆరోగ్యం, పర్యావరణం దెబ్బతింటున్నాయని వారు ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదుల మేరకు.. ఇటీవల విచారణ జరిపిన ఎన్జీటీ.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు చెత్త తరలింపును వెంటనే నిలిపివేయాలని తీర్పు ఇచ్చింది. అయితే... దేశంలోనే అతిపెద్ద నగరాల్లో ఒకటైన హైదరాబాద్‌లో చెత్త తరలింపు ఆగిపోతే, నగరంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి గందరగోళ పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని జీహెచ్ఎంసీ అధికారులు ఎన్జీటీకి విన్నవించుకున్నారు. దీంతో బుధవారం విచారణ సందర్భంగా బల్దియాకు తాత్కాలిక ఉపశమనం లభించింది. చెత్త తరలింపును కొనసాగించడానికి ఎన్జీటీ అనుమతి ఇచ్చింది. అయితే.. ఇష్టానుసారంగా చెత్త పోయడం కాకుండా, యార్డులో మరోసారి 'క్యాపింగ్' (చెత్తను కప్పివేసి, శాస్త్రీయంగా మూసివేసే ప్రక్రియ) చేయాలని, వ్యర్థాల నిర్వహణకు అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎన్జీటీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా, 'వేస్ట్ టు ఎనర్జీ' ప్రాజెక్టుల ద్వారా చెత్తను విద్యుత్తుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని.. పొడి చెత్త, తడి చెత్త వేర్వేరుగా సేకరించే ప్రక్రియను మరింత మెరుగుపరచాలని సూచించింది. ఎన్జీటీ తాజా సూచనలతో జీహెచ్ఎంసీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నగరంలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే వేలాది టన్నుల చెత్తను శాస్త్రీయంగా నిర్వహించడం ఒక సవాలుగా మారుతున్నందున.. భవిష్యత్తులో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజుకు 6,500 టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి అవుతోంది. పెరుగుతున్న నగర జనాభా, వ్యర్థాల పెరుగుదల నేపథ్యంలో ఈ నిర్వహణ జీహెచ్ఎంసీకి ప్రధాన సవాలుగా మారింది. జరిమానాను పాఠంగా తీసుకుని.. భవిష్యత్తులో పర్యావరణ నిబంధనలను కచ్చితంగా పాటించడానికి.. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటానికి బల్దియా అధికారులు కొత్త ప్రణాళికలను సిద్ధం చేయాలని భావిస్తున్నారు. ఈ ఎన్జీటీ తీర్పు హైదరాబాద్‌లో పర్యావరణ సమస్యల పరిష్కారం పట్ల మరింత జవాబుదారీతనం అవసరాన్ని చెబుతోంది.

# అధికారుల హెచ్చరిక..

తెలంగాణ ఫారెస్ట్ అధికారులు జనాలకు కీలక హెచ్చరిక జారీ చేశారు. అటవీ భూములు ఆక్రమించినా.. చెట్లను నరికినా.. నేరుగా జైలుకే పంపుతామని హెచ్చరిస్తున్నారు. అయితే ఈ ఆంక్షలు అన్ని చోట్ల కాదు. ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌కు మాత్రమే. కొందరు ఇక్కడ ఉన్న టేకు చెట్లను కొట్టి అమ్ముకుని జల్సాలు చేస్తున్నారు. అలాంటి వారికి అటవీశాఖ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఇక మీదట చెట్లు కొడితే నేరుగా జైలుకే వెళ్తారని హెచ్చరించింది. ఆ వివరాలు.. చెట్లు నరికేవారికి అటవీ శాఖ అధికారులు కీలక హెచ్చరిక జారీ చేశారు. చెట్లు నరికితే నేరుగా జైలుకే పంపుతామని హెచ్చరిస్తున్నారు. అయితే ఇది రాష్ట్రం అంతటా కాదు. ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలో అటవీ భూముల ఆక్రమణలు, టేకు చెట్లను నరికి అక్రమ రవాణా చేయడంపై అటవీశాఖ



ఉక్కుపాదం మోపుతోంది. ఇటీవల పాలగోరి అటవీ ప్రాంతంలో 400 టేకు చెట్లను నరికివేశారు. ఈ క్రమంలో అధికారులు ఇందుకు బాధ్యులైన 32 మంది ఆదివాసీ గిరిజనులపై కేసులు నమోదు చేశారు. వారిలో 26 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. అయితే వీరికి బెయిల్ రాకుండా అడ్డుకోవడానికి అటవీశాఖ గట్టిగా వాదిస్తోంది. ఇదిలా ఉంటే దండేపల్లికి చెందిన పెందూర్ రాజేశ్ అనే వ్యక్తి అడవిలో చెట్లు నరికడమే కాక.. దాని గురించి నేరుగా అటవీ అధికారులకే సమాచారం ఇచ్చి మరీ తప్పించుకోవాలని ప్రయత్నించాడు. కానీ అటవీ అధికారులు జాగిలం సాయంతో అతడిని పట్టుకున్నారు. అలాగే తాళ్లపేట రేంజిలో ద్విచక్ర వాహనంపై టేకు ముక్కలను తరలిస్తున్న మరో వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకుని రిమాడ్‌కు తరలించారు. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలో కొందరు.. తమను ఎవరూ చూడటం లేదనే ధీమాతో యథేచ్ఛగా అటవీ భూములను ఆక్రమించడం.. అనుమతి లేకుండా చెట్లను నరికి సొమ్ము చేసుకోవడం వంటి పనులు కొనసాగిస్తున్నారు. అయితే, ఈ అటవీ విధ్వంసంపై అటవీశాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. ఇటీవల ఇలా చెట్లను నరికి అక్రమ సంపాదన ఆర్జిస్తున్న పలువురిని అరెస్టు చేసి జైలుకు పంపింది. గతంలో పాలగోరి ప్రాంతంలో పోలీసులు అరెస్ట్ చేసిన వారంతా జైల్లోనే ఉన్నారు. వీరు జైలుకెళ్లి సుమారు 54 రోజులు అవుతోంది. ఈ నిందితులందరికీ బెయిల్ లభించకుండా అటవీశాఖ తరఫున బలమైన వాదనలు వినిపిస్తున్నారు. దీంతో పాటు.. పాలగోరి అటవీ ప్రాంతం చుట్టూ అటవీశాఖ అధికారులు కందకాలు తవ్వించి, అక్కడ సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం కావడంతో ఇక్కడ అటవీ ప్రాంతం పరిరక్షణ కోసం అనేక కఠిన చర్యలు అమలు చేస్తున్నారు. చెట్లను రక్షించడం కోసం అధికారులు అనేక చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగానే ఇప్పుడు చెట్లను నరికేవారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

# బిగ్గెస్ట్ స్పాయిలర్..



సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'తెలుసు కదా' ఓటీటీ రిలీజ్‌కు సిద్ధమైంది. నవంబర్ 14 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు ప్లాట్‌ఫారమ్ ప్రకటించగా, దీనిపై సిద్ధు చేసిన హాస్య ట్వీట్ వైరల్ అవుతోంది. "చిల్డ్రన్స్ డే రోజున తెలుసు కదా స్ట్రీమింగ్ పెట్టడం పెద్ద స్పాయిలర్" అని సరదాగా కామెంట్ చేశాడు. అక్టోబర్‌లో విడుదలైన ఈ రొమాంటిక్ డ్రామా థియేటర్లలో మోస్తరు వసూళ్లు సాధించినప్పటికీ, సిద్ధు నటన, రాశీఖన్నా%-%శ్రీనిధి శెట్టి పాత్రలు, తమన్ సంగీతం మంచి ప్రశంసలు పొందాయి. ఓటీటీలో సినిమా ఎలా రాణిస్తుందో ఆసక్తి పెరిగింది. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్టైల్, ఎనర్జీ, స్లాంగ్‌తో యూత్‌ఫుల్ హీరోగా ఎదిగాడు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన తాజాగా నటించిన చిత్రం ' తెలుసు కదా '. 'డీజే టిల్లూ' సిరీస్‌తో భారీ క్రేజ్ తెచ్చుకున్న సిద్ధు రొమాంటిక్ ఎమోషన్స్‌తో పాటు డెప్త్ ఉన్న పాత్రలను కూడా పోషించగలనని నిరూపించుకున్నాడు. లేడీ డైరెక్టర్ నీరజ కోన దర్శకత్వంలో వచ్చిన 'తెలుసు కదా'లో ఆయన పాత్ర యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియన్స్‌కు బాగా కనెక్ట్ అయింది. రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి వంటి స్టార్ హీరోయిన్‌లతో కలిసి నటించిన ఈ చిత్రం విజువల్‌గా, మ్యూజికల్‌గా కూడా ఆకట్టుకుంది. ప్రత్యేకంగా తమన్ అందించిన సంగీతం సినిమా రిలీజ్ కాకముందే చార్ట్ బస్టర్‌గా నిలిచింది. వరుణ్ అనే అనాథ యువకుడు తనకంటూ ప్రేమతో నిండిన కుటుంబం కావాలనుకునే సున్నితమైన భావజాలంతో ఈ సినిమా తెరకెక్కింది. కాలేజీ ప్రేమతో మొదలైన వరుణ్%-%రాగ కథలో వచ్చే మలుపులు, వాటిని దాటుకుంటూ వరుణ్ జీవితంలోకి అంజలి ప్రవేశించడం, వారికి ఎదురయ్యే ఊహించని సమస్య ఈ రొమాంటిక్ డ్రామాను ఎమోషనల్‌గా నిలబెట్టాయి. థియేటర్లలో ఈ చిత్రం మోస్తరు ఫలితం సాధించినప్పటికీ, సిద్ధు నటన, రాశీ%-%శ్రీనిధిల గ్లామర్, తమన్ సంగీతం ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ సొంతం చేసుకున్నాయి. ఈ మూవీ ఓటీటీ రైట్స్‌ని నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా.. ఈ నెల 14న నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయితే మరికొద్ది గంటల్లో 'తెలుసు కదా' మూవీ స్ట్రీమింగ్‌కి సిద్ధమవుతోన్న తరుణంలో సిద్ధు జొన్నలగడ్డ చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. "చిల్డ్రన్స్ డే రోజున 'తెలుసు కదా' రిలీజ్ చేయడం పెద్ద స్పాయిలర్!" అంటూ సిద్ధు ట్వీట్ చేశాడు. మ్యూచువల్ రిలేషన్‌షిప్, కాంప్లెక్స్ ఎమోషన్, అడల్ట్ థీమ్ ఉన్న రొమాంటిక్ డ్రామాని పిల్లల దినోత్సవం రోజున రిలీజ్ చేయడాన్ని ఉద్దేశించి ఆయన ఇలా కామెంట్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ ట్వీట్‌ని సిద్ధు కోపంతో చేశాడని కొందరు, అలాకాదు కేవలం ఫన్ కోసమే చేసి ఉంటాడని మరికొందరు చర్చించుకుంటున్నారు. అయితే సిద్ధు ట్వీట్ కొందరు నెటిజన్లు మాత్రం నెగిటివ్‌గా స్పందిస్తున్నారు. అసలు నువ్వు ఈ సినిమా చేయడమే పెద్ద స్పాయిలర్ అన్నా, ఇలాంటి సినిమాలు మానేసి మంచి కాన్సెప్ట్‌తో తీయన్నా అంటూ కొందరు అభిమానులు రిక్వెస్ట్ చేస్తున్నారు. మొత్తంగా 'తెలుసు కదా' థియేటర్లలో మోస్తరు ఫలితం సాధించినప్పటికీ, ఓటీటీలో మంచి వ్యూయర్‌షిప్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సిద్ధు ట్వీట్‌తో సినిమాపై ఆసక్తి ఇంకా పెరిగింది.

# జక్కన్న మాస్టర్ మైండ్..




రాజమౌళి%-%మహేష్ బాబు కాంబోలో వస్తున్న పాన్ ఇండియా యాక్షన్ అడ్వెంచర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. పృథ్వీరాజ్, ప్రియాంక చోప్రా ఫస్ట్‌లుక్ పోస్టర్లు విడుదల కావడంతో హైప్ మరింత పెరిగింది. నవంబర్ 15న రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్న 'గ్లోబ్ ట్రోటర్' ఈవెంట్‌లో మహేష్ బాబు లుక్, గ్లింప్స్ విడుదల కానున్నాయి. ఈవెంట్‌కి ఏ మీడియాను అనుమతించకుండా, స్ట్రీమింగ్ హక్కులను జియో హాట్ స్టార్‌కు రూ.50 కోట్లకు విక్రయించడం రాజమౌళి మాస్టర్ ప్లాన్‌గా మారింది. ఈ ఈవెంట్ కోసం దేశవ్యాప్తంగా అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. భారతీయ సినిమా చరిత్రలో అత్యంత భారీ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా తెరకెక్కుతున్న ఎస్.ఎస్. రాజమౌళి , మహేష్ బాబు సినిమా( %ఎస్ఎస్ఎంబీ%29 )పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రపంచ యాత్ర నేపథ్యంతో రూపొందుతున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ ఫాంటసీ డ్రామా రెండు భాగాలుగా రాబోతుందన్న సమాచారం ఇప్పటికే సినీ ప్రియుల్లో భారీ హైప్‌కు కారణమైంది. వందల కోట్ల బడ్జెట్‌తో, అంతర్జాతీయ టెక్నీషియన్లు, ప్రముఖ హాలీవుడ్ టీమ్‌తో కలిసి రాజమౌళి రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని హాలీవుడ్ రేంజ్‌లో రిలీజ్ చేసేందుకు జక్కన్న ప్లాన్ చేస్తున్నారు. 120 దేశాల్లో 100 కోట్ల మందికి చేరువయ్యేలా రూ.10వేల కోట్ల కలెక్షన్లు టార్గెట్‌గా రాజమౌళి చిత్రాన్ని గ్లోబల్ లెవెల్‌కి తీసుకెళ్తారని టాక్. తాజాగా పృథ్వీరాజ్ సుకుమారన్ "కుంభ"గా, ప్రియాంక చోప్రా "మందాకిని"గా కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్లు సోషల్ మీడియాలో సంచలనం సృష్టించాయి. ఈ ఇద్దరిని ఎప్పుడూ చూడని పాత్రల్లో చూపించిన జక్కన్న విజన్‌పై సినీ ప్రపంచం ప్రశంసల వర్షం కురిపిస్తోంది. ఈ చిత్రం గ్లోబల్ ప్రమోషన్స్ కోసం రాజమౌళి ప్రత్యేకంగా ప్లాన్ చేసిన గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్‌పై దేశవ్యాప్తంగా భారీ ఆసక్తి నెలకొంది. నవంబర్ 15న రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్న ఈ గ్రాండ్ ఈవెంట్‌లో మహేష్ బాబు లుక్, సినిమా కాన్సెప్ట్ గ్లింప్స్, ప్రధాన నటీనటుల వివరాలు బయటకు రాబోతున్నాయి. ఈవెంట్‌ను పాన్ ఇండియా స్థాయిలో కాకుండా ఇంటర్నేషనల్ లెవెల్ ప్రమోషన్ స్ట్రాటజీకి తగినట్లుగా రాజమౌళి ప్లాన్ చేశాడు. ప్రేక్షకులు, అభిమానులు మాత్రమే కాదు, ఇండియన్ సినీ ఇండస్ట్రీ మొత్తం ఈ ఈవెంట్ కోసం ఎదురుచూస్తోంది. మీడియాని ఆహ్వానించకపోవడం కూడా ఈ ఈవెంట్‌పై కుతూహలం పెరిగేలా చేసింది. ఈ ఈవెంట్ వెనుక రాజమౌళి వేసిన మాస్టర్ మైండ్ ప్లాన్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రూ.30 కోట్ల ఖర్చుతో ఈ భారీ ఈవెంట్‌ను పూర్తిగా బిజినెస్ మోడల్‌గా మార్చేసిన రాజమౌళి.. ఈ ఈవెంట్ స్ట్రీమింగ్ హక్కులను జియో హాట్ స్టార్‌కి ఏకంగా రూ. 50 కోట్లకు విక్రయించినట్లు సమాచారం. అంటే ఈవెంట్ మీద ఖర్చయిన మొత్తానికి మించి లాభం వచ్చేలా సెట్ చేశారన్నమాట. ఈ వ్యవహారమే రాజమౌళి కమర్షియల్ విజన్ ఎంత స్ట్రాంగ్‌గా ఉంటుందో నిరూపిస్తోంది. సినిమా కోసం ఎంత ఖర్చు పెట్టించినా అంతకుమించి వసూలు చేయడం రాజమౌళికి వెన్నతో పెట్టిన విద్య. అందుకే ఆయన సినిమాలకి ఎప్పుడూ నష్టాలు రావు. అందుకే ఆయనతో పని చేయడానికి పెద్ద పెద్ద ప్రొడక్షన్ హౌస్‌లు ఎప్పుడూ ఆసక్తి చూపుతుంటాయి. 'కుంభ', 'మందాకిని' పోస్టర్లతో ఒక్కసారిగా హైప్ పెంచేసిన రాజమౌళి.. మహేష్ బాబు లుక్‌ను ఏ రేంజ్‌లో చూపిస్తాడోనని ప్రేక్షకులంతా ఆసక్తిగా గమనిస్తున్నారు.

# తాండవానికి సిద్ధం..



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబోలో రూపొందుతున్న పాన్ ఇండియా మాస్ ఎంటర్టైనర్ 'అఖండ 2 : తాండవం'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫస్ట్‌లుక్, టీజర్‌కు అపూర్వమైన రెస్పాన్స్ రావడంతో సినిమా హైప్ పెరిగింది. తాజా అప్‌డేట్ ప్రకారం ఫస్ట్ సింగిల్‌ను నవంబర్ 14న సాయంత్రం 5 గంటలకు ముంబై పీవీఆర్ జుహూలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది నందమూరి నటసింహం బాలకృష్ణ పేరు వినగానే ప్రేక్షకుల్లో వచ్చే ఎలక్ట్రిఫైయింగ్ ఎనర్జీ వేరే లెవెల్ ఉంటుంది. ప్రత్యేకమైన డైలాగ్ డెలివరీ, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, మాస్ ఇంపాక్ట్ ఈ మూడు కలిసిన బాలయ్య అంటే ప్రేక్షకులకి ఒక అలౌకిక అనుభూతి. అలాంటి బాలయ్య మరోసారి తన పవర్ చూపించడానికి ' అఖండ 2 : తాండవం'తో రెడీ అవుతున్నాడు. ఇప్పటికే 'అఖండ'తో రికార్డుల వర్షం కురిపించిన బాలకృష్ణ%-%బోయపాటి శ్రీను కాంబో మళ్లీ స్క్రీన్‌పై మంత్రం వేయబోతున్నారు. మొదటి భాగం మాదిరిగానే ఈ సీక్వెల్‌కి కూడా అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ మూవీపై క్రేజ్‌ని విపరీతంగా పెంచేశాయి. శివతాండవం వేస్తున్నట్లుగా బాలయ్య లుక్ ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది. ఇక తర్వాత వచ్చిన టీజర్‌కి వచ్చిన రెస్పాన్స్ మామూలుగా లేదు. బాలకృష్ణ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్, బోయపాటి స్టైల్‌కు తగ్గట్టుగా ఉన్న పవర్‌ఫుల్ విజువల్స్, తమన్ ఇచ్చిన బ్లాస్టింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అన్నీ కలిపి టీజర్‌కి మిలియన్ల కొద్దీ వ్యూస్‌కి తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో బాలయ్య ఫ్యాన్స్ "అఖండ తిరిగి వచ్చాడు" అంటూ ట్రెండ్ మొదలు పెట్టగా, పాన్ ఇండియా ఆడియన్స్ కూడా ఈ సీక్వెల్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అంత భారీ అంచనాల మధ్య ఇప్పుడు మేకర్స్ 'అఖండ 2' ఫస్ట్ సింగిల్‌పై క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. సినిమాపై ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను కూడా ప్రత్యేకంగా ప్లాన్ చేశారు. రేపు నవంబర్ 14న సాయంత్రం 5 గంటలకు ముంబై పీవీఆర్ జుహూలో ఈ ఫస్ట్ సింగిల్‌ను గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. ఇదే ఈవెంట్‌తో 'అఖండ 2 : తాండవం' ప్రమోషన్స్ పాన్ ఇండియా స్థాయిలో అధికారికంగా ప్రారంభం కానున్నాయి. ఇతర భాషల ప్రేక్షకులను కూడా టార్గెట్ చేస్తూ బాలయ్య మాస్ ఎనర్జీని దేశవ్యాప్తంగా షోకేస్ చేయాలని టీమ్ సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్న ఎస్. తమన్ మళ్లీ ఓ సెన్సేషనల్ ఆల్బమ్ అందించబోతున్నాడని టాక్. బాలయ్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌కి తగ్గట్టుగా తమన్ తన బెస్ట్ ఇస్తున్నాడని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది.

# నేను మంచి భర్తని..



'ది గర్ల్ ఫ్రెండ్' సక్సెస్ మీట్‌లో నిర్మాత బన్నీ వాసు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రష్మిక మందన్న నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో చిత్రబృందం సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. ఈ వేడుకలో బన్నీ వాసు మొదట విజయ్ దేవరకొండ, రాహుల్ రవీంద్ర, రష్మిక నటనలను ప్రశంసించారు. తరువాత "అబ్బాయిలు అమ్మాయిలతో ఈ సినిమాకి వెళ్తే హెల్మెట్ కొనుక్కోండి" అంటూ చేసిన జోక్ వెంటనే వైరల్ అయ్యింది. ఆయన వెంటనే దాన్ని కవర్ చేసినా, ఆ లైన్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయిపోయింది. టాలీవుడ్‌లో టాప్ ప్రొడ్యూసర్‌గా కొనసాగుతోన్న బన్నీ వాసు స్పీచ్‌లు ఇవ్వడంలోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్ నుంచి వచ్చిన ప్రతి పెద్ద విజయానికి ఆయన చేసిన కృషి ప్రత్యేకమే. అల్లు అరవింద్‌తో కలిసి అనేక హిట్ చిత్రాలను అందించిన బన్నీ వాసు ఇతర బ్యానర్లలో తెరకెక్కిన సినిమాల ఈవెంట్లకి కూడా హాజరవుతూ తనదైన శైలిలో కామెంట్స్ చేస్తుంటారు. తాజాగా 'ది గర్ల్ ఫ్రెండ్' సక్సెస్ మీట్‌లో చేసిన ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రష్మిక మందానా ప్రధాన పాత్రలో వచ్చిన 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. రష్మిక కెరీర్‌లో మరో హై ఇంపాక్ట్ మూవీగా నిలిచిన ఈ చిత్రం కలెక్షన్ల పరంగానూ ఫర్వాలేదనిపించింది. సెన్సిబుల్ నేరేషన్, భావోద్వేగాలు, సంగీతం, రష్మిక నటన ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. దీక్షిత్ శెట్టి నటనకి కూడా ప్రేక్షకులు కితాబిస్తున్నారు. మూవీ టీమ్ ఈ సక్సెస్‌ను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకునేందుకు ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌కి సినీ ప్రముఖులు కూడా హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లో రష్మిక గురించి, సినిమాలో ఆమె చేసిన డేర్ రోల్ గురించిన చర్చ పెద్ద ఎత్తున జరిగింది. అలాగే రష్మిక ప్రియుడు విజయ్ దేవరకొండ హాజరుకావడంతో ఈవెంట్‌లో సందడి మరింత పెరిగింది. ఈ సందర్భంలో బన్నీ వాసు ఇచ్చిన స్పీచ్ మొత్తం ఈవెంట్‌కి హైలైట్ అయ్యింది. ముందుగా విజయ్ దేవరకొండను పొగడ్తలతో ముంచెత్తిన ఆయన "గీతా ఆర్ట్స్‌కు విజయ్ దేవరకొండ బంగారు కొండ" అంటూ చెప్పిన మాటలు ఫ్యాన్స్‌ను ఉత్సాహపరిచాయి. తరువాత డైరెక్టర్ రాహుల్ రవీంద్ర క్రియేటివ్ అప్రోచ్‌ను ప్రశంసించారు. రష్మిక, దీక్షిత్ శెట్టి నటన గురించి మాట్లాడి సినిమా ట్రైలర్‌లో చూపించినదే సినిమాలో చూపించారని పేర్కొన్నారు. "అమ్మాయిలు%% మీ బాయ్‌ఫ్రెండ్‌ను 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాకి తీసుకెళ్లమని అడగండి. వాళ్లు ఏమీ మాట్లాడకుండా సరే అంటే వారు మంచి బాయ్ ఫ్రెండ్స్. నేను మా ఆవిడతో కలిసి సినిమా చూసాను నేను మంచి భర్తనే అనుకోండి" అంటూ బన్నీ వాసు నవ్వులు పూయించాడు.

# పీక్స్‌లో 'సంతాన ప్రాప్తిరస్తు'



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా గురువారం థియేటర్లలో విడుదల కానుంది. సంతానలేమి సమస్య నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం.. నేటి సమాజంలో యువ జంటలు ఎదుర్కొనే సవాళ్లను ఈ సినిమాలో వినోదాత్మకంగా చూపించినట్లు తెలుస్తోంది. ప్రమోషన్స్ లో భాగంగా స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉన్న యువకుడి మానసిక వేదన, అందుకు గల కారణాలను వివరిస్తూ హీరో విక్రాంత్ చేసిన వీడియో నెట్టింట వైరల్ గా మారింది. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన సినిమా ' సంతాన ప్రాప్తిరస్తు '. సంజీవ్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ గురువారం (నవంబర్ 14) గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుంది. ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర బృందం చేసిన ఓ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. నేటి సమాజంలో యువ జంటలు ఎదుర్కొంటున్న సంతానలేమి సమస్య నేపథ్యంగా కంప్లీట్ ఎంటర్టైన్మెంట్ మూవీగా 'సంతాన ప్రాప్తిరస్తు' రూపొందించారు. ఇప్పటి వరకూ రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ తోనే ఆ విషయం స్పష్టంగా చెప్పారు. పెద్దలను కాదని పెళ్లి చేసుకున్న ఓ జంట.. పిల్లలు పుడితే పెద్దలు తమను మళ్లీ దగ్గరకు తీసుకుంటారని ఆశ పడతారు. కానీ అక్కడే వారికి ఓ సమస్య వచ్చి పడింది. స్పెర్మ్ కౌంట్ తక్కువ ఉండటంతో పిల్లలు పుట్టే అవకాశం తక్కువగా ఉంది. ఈ క్రమంలో పిల్లల కోసం ఆ జంట చేసిన ప్రయత్నాలు, ఫన్నీ సిచ్యుయేషన్స్, ఫన్ కాస్తా ఫ్రస్టేషన్ గా మారడం, ఎమోషనల్ టర్న్ తీసుకోవడం వంటి అంశాలతో 'సంతాన ప్రాప్తిర-స్తు' సినిమా రూపొందింది. (ప్రభాస్ 'స్పిరిట్'లో చిరంజీవి.. సందీప్ రెడ్డి వంగా క్లారిటీ) 'సంతాన ప్రాప్తిరస్తు' మూవీ కాన్సెప్ట్ కి తగ్గట్టుగానే హీరో విక్రాంత్, యూట్యూబర్ లక్ష్మణ్ కలిసి ఓ ప్రమోషనల్ వీడియో చేశారు. "మీరూ బాగా బ్యాటింగ్ చేస్తున్నా కూడా స్పెర్మ్ కౌంట్ తగ్గడం వల్ల పిల్లలు పుట్టకపోవడం చాలా దారుణం" అంటూ స్టార్ట్ చేసిన లక్ష్మణ్.. ప్రతీ 100 మందిలో 30 నుంచి 40 శాతం మంది పిల్లల్ని కనడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. అందులో చాలామంది మగవాళ్లలో స్పెర్మ్ కౌంట్ తక్కువుగా ఉండటమే కారణమని వివరించాడు. "స్పెర్మ్ కౌంట్ పెంచుకోడానికి రెండు కిడ్నీలు అమ్ముకోవాల్సి వచ్చింది" అని విక్రాంత్ తన సమస్య గురించి చెబుతాడు. జాబ్ స్ట్రెస్, స్మోకింగ్, డ్రింకింగ్, జంక్ ఫుడ్స్, లేట్ నైట్ నిద్రపోవడం వంటి దురలవాట్లు స్పెర్మ్ కౌంట్ తగ్గడానికి కారణవ-ఎవుతాయని చెప్పారు. హెల్తీగా ఉండకపోతే ఏమవుతుందో నవంబర్ 14న రిలీజ్ కాబోతున్న 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమాలో చూడండి అని చెప్పుకొచ్చారు. సెన్సిటివ్ టాపిక్ పై సరదాగా రూపొందించిన ఈ వీడియో ఆకట్టుకుంటోంది.

# రషి జర్నీ చూస్తుంటే గర్వంగా ఉంది



రష్మిక మందన నటించిన 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన సక్సెస్ సెలబ్రేషన్స్‌కు ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ, రష్మిక నటనను ప్రశంసించారు. ఆమెను 'రషి' అని ముద్దుగా పిలుస్తూ, ఆమె ఎంపిక చేసుకునే బలమైన కథలను, ఆమె ప్రశాంతమైన వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ఈ సినిమా ఎమోషనల్ గా ఉందని, ఇటీవల కాలంలో వచ్చిన ఉత్తమ చిత్రాలలో ఒకటిగా అభివర్ణించారు. రష్మిక మందన ప్రధాన పాత్రలో రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఇందులో దీక్షిత్ శెట్టి, అను ఇమ్మాన్యుయేల్ కీలక పాత్రలు పోషించారు. ఇటీవల రిలీజైన ఈ మూవీ ఆడియన్స్ నుంచి హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ దగ్గర డీసెంట్ కలెక్షన్స్ రాబడుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ ఈవెంట్ కి హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రష్మిక నటనపై ప్రశంసలు కురిపించారు. ఆమె పేరు పలికిన ప్రతిసారి 'రషి' నిక్ నేమ్‌తో పిలిచారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "ఈరోజే సినిమా చూసా. నన్ను ఎమోషనల్ అయ్యేలా చేసింది. చాలా చోట్ల కన్నీళ్లు ఆపుకోవాల్సి వచ్చింది. చాలా దగ్గర లోపల బరువైన టైట్ ఫీలింగ్ వచ్చింది. చివరికి ఇటీవల కాలంలో వచ్చిన బెస్ట్ ఫిల్మ్స్ లో ఒకటి అనిపించింది. సినిమాలో చూపించినట్లు అలాంటి రిలేషన్స్ షిప్ చూసి నాకు బాధ అనిపించింది. రిలేషన్స్ షిప్స్ ఫ్రెండ్లీగా ఉండాలి. మన పార్టనర్ కి రక్షణ ఉండాలని మనందరికి ఒక ఫీలింగ్ ఉంటుంది. అది వాళ్లను కంట్రోల్ చేసేలా ఉండకూడదు. వాళ్ల డ్రీమ్స్ కి, సంతోషాలకు రక్షగా నిలబడాలి. ఇద్దరి జీవితంలో ఎన్ని మంచి జ్ఞాపకాలు ఉన్నాయనేది ముఖ్యం. పుట్టడం, చనిపోవడంలో మనకు ఛాయిస్ ఉండదు. ఆ రెండింటి మధ్య జరిగే ప్రతి విషయంలో ఎంతో కొంత ఛాయిస్ ఉంటుంది. అది మన భవిష్యత్‌ను మారుస్తుంది. జీవితం చాలా సింపుల్‌గా సరదాగా ఉండాలి. సినిమా చూసిన నాకు ఇంత ఎమోషనల్ గా, ఇంత డిస్టర్బింగ్ గా అనిపించింది అంటే.. ఇలాంటి సిచువేషన్స్ ఫేస్ చేసిన వాళ్లకి ఇంకెంత ఎమోషనల్ అనిపించి ఉంటుందో" అని అన్నారు. "రష్మికని నేను 'గీత గోవిందం' సినిమా టైమ్ నుంచే చూస్తున్నా, ఈమె ఎగ్జాక్ట్ గా భూమా దేవిలా ఉంటుంది. ఆమెలో తెలియని అమాయకత్వం ఉంటుంది. తన గురించి ఆలోచించదు. సెట్ లో అందరూ హ్యాపీగా ఉండాలని ఆలోచిస్తూ ఉంటుంది. ఇప్పటికీ ఆమె అలానే ఉంది. అక్కడి నుంచి మొదలైన ఆమె ప్రస్థానం ఇప్పుడు తనకి తానుగా ది గర్ల్ ఫ్రెండ్ లాంటి బలమైన స్క్రిప్ట్‌లను ఎంచుకునే స్థాయికి వచ్చింది. ఎవరు చూస్తారో తెలియదు కానీ..

Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at Crime Counter Office, Opp Parivarthana school, Narasaraopate Road, Sattenapalle, AP. 522403. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com